సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 31 । ఆగస్టు । 2023



ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు 8లో

ఎస్‌ఐ మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి.



ఘాట్‌రోడ్డులో నిలిచిన లారీ

మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో లోడు లారీ రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది



ఊళ్లకు సరికొత్త అందాలు!

ఊళ్లు సరికొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. కొంగొత్త ప్రభుత్వ భవనాలతో శోభిల్లుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

205 మందికి ఉచిత వైద్యసేవలు



ముంచంగిపుట్టులో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: స్థానిక శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో బుధవారం శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలో పలు గ్రామాలకు చెందిన 205 మంది ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడుతూ అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రులను ఆశ్రయించాలని, నాటు వైద్యంపై ఆధారపడవద్దని సూచించారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, శారద ట్రస్ట్ బోర్డు మెంబర్ రోజా, వైద్యులు అన్వేష్, ప్రేమ్‌చంద్, రవితేజ, పద్మ, లలిత, ప్రిన్సిపాళ్లు చిరంజీవి, బుచ్చిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆధాష్ సొల్యూషన్స్, ఎంఎస్ మెరైన్ సర్వీసెస్, ట్రీనిటెక్ ఇన్ఫ్రా ఇండియా, టీం లీజ్, బయోఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ తదితర కంపెనీల్లో 640 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, కార్పెంటర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గొడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన మహిళా, పురుష అభ్యర్థులు అర్హులు. వయసు 18–45ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.12,500 నుంచి రూ40,000 వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in లో పేర్లు నమోదు చేసుకుని.. శుక్రవారం జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని వారు కోరారు.


అరకు క్రీడా పాఠశాలకు ఎక్స్‌లెంట్ అవార్డు



విజేత క్రీడాకారులతో గురుకుల క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్‌లు

అరకులోయ: స్థానిక గిరిజన గురుకుల క్రీడా పాఠశాలకు జిల్లా స్థాయిలో క్రీడా ఎక్స్‌లెంట్ అవార్డు లభించిందని ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ మూర్తి బుధవారం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పాడేరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ (బాలురు) విభాగంలో తమ క్రీడా పాఠశాలకు చెందిన వి.అజిత్‌కుమార్, పి.గౌతమ్ ప్రథమ, ఆదిత్య, వి.వరుణ్ ద్వితీయ స్థానంలో నిలిచారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కోచ్‌లు కె.రాజబాబు, డి.కొండలస్వామి, ఎల్.సూరిబాబు, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు



ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న సోషల్‌మీడియా కన్వీనర్ నర్సింగరావు, వినోద్

డుంబ్రిగుడ: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే ధోరణితో వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌కు అరకులోయ నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్ పాంగి నరసింగరావు ఫిర్యాదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు వినోద్‌కుమార్, సోషల్‌మీడియా కన్వీనర్ మోహన్‌రావు, లవకుశ పాల్గొన్నారు.

సుజనకోట..అభివృద్ధి బాట

సుమారు 15 గిరిజన గ్రామాలకు పంచాయతీ కేంద్రమైన సుజనకోట ముఖచిత్రం మారనుంది. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందనుంది. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దత్తత తీసుకున్న ఈ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ సిద్ధమైంది. ఇదే ప్రాంతంలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డ పరిసరాలు పర్యావరణ పర్యాటకంగా త్వరలోనే అభివృద్ధి చెందనుంది.

- రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దత్తతతో చిగురిస్తున్న ఆశలు
- మౌలిక వసతుల కల్పనకు సిద్ధమైన కార్యాచరణ
- పర్యావరణ పర్యాటకంగా అభివృద్ధి చెందనున్న మత్స్యగెడ్డ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పర్యావరణ పర్యాటకంలో భాగంగా అభివృద్ధి చెందనున్న సుజనకోట పంచాయతీలోని మత్స్యగెడ్డ దీవులు

ముంచంగిపుట్టు: ప్రకృతి అందాలకు నెలవు సుజనకోట. ఈ పంచాయతీ పరిధిలో ఎటుచూసినా పచ్చదనం.. వేల ఎకరాల్లో మత్స్యగెడ్డ పాయలు విస్తరించి ఉన్నందున ప్రకృతి అందాలు కనువిందు చేస్తుంటాయి. ఒక వైపు పచ్చని దీవులు.. మరోవైపు సుందర ప్రదేశాలు పర్యాటకులను కట్టిపడేస్తుంటాయి. అందమైన ప్రాంతం అభివృద్ధిపై గత పాలకులు శీతకన్ను వేశారు.

విజయసాయిరెడ్డి దత్తతతో..

సుమారు 15 గిరిజన గ్రామాలున్న ఈ పంచాయతీని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దత్తత తీసుకున్నారు. సుమారు 816 కుటుంబాలకు చెందిన 2016 మంది జనాభా ఉన్నారు. ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ పంచాయతీకి అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

– తాగునీరు, రోడ్లు, పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, కుమ్మరిపుట్టు వంతెన నిర్మాణం, గిరిజన మత్స్యకారులకు వలలు, బోట్లు తదితర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. పర్యవేక్షణ బాధ్యతలను అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి విజయసాయిరెడ్డి అప్పగించారు.

అందాల లోగిలి మత్స్యగెడ్డ

మండలంలో ఆరు పంచాయతీల పరిధిలో మత్స్యగెడ్డ ప్రవహిస్తోంది. ప్రధానంగా సుజనకోట పంచాయతీలో మత్స్యగెడ్డ అందాలు కట్టిపడేస్తుంటాయి. మెలికలు తిరుగుతూ ఎత్తయిన గిరుల మధ్య ప్రవహించే మత్స్యగెడ్డ పాయలు కనువిందు చేస్తుంటాయి.

త్వరలోనే పనులు



రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దత్తత తీసుకున్న సుజనకోట పంచాయతీని పర్యాటకంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

షూటింగ్‌ల సందడి

- **మత్స్యగెడ్డ పరిసరాలు త్వరలో సినిమా షూటింగ్‌లతో సందడిగా మారనుంది. ఇప్పటికే ప్రముఖ డైరెక్టర్లు,** ఫొటోగ్రాఫర్లు, లొకేషన్ మేనేజర్లు ఈ ప్రాంతాలను సందర్శించారు. సుందర దృశ్యాలను కెమెరాల్లో బంధించారు. త్వరలోనే సినిమా షూటింగ్‌లకు నిలయంగా మారనుంది.

పర్యాటకులతో నిత్యం సందడే

ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు వందల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఒడిశాలోని పాడువ నుంచి ఫైబర్ బోటులో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలోని మత్స్యగెడ్డలో బోటు షికార్‌కు ఉత్సాహం చూపుతున్నారు.

- సుందర దృశ్యాలకు నెలవైన ఈ ప్రాంతం అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఈ ప్రాంతం మరుగున పడిపోయింది. సుజనకోట పంచాయతీ అభివృద్ధిపై విజయసాయిరెడ్డి దృష్టి సారించడంతో మంచి రోజులు వచ్చినట్టేనని ఈ ప్రాంతీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దత్తత ఎంతో సంతోషం



సుజనకోట పంచాయతీని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దత్తత తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఆధ్యాత్మికం, పర్యాటకంగా అభివృద్ధి చెందితే గిరి యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. త్వరలోనే పనులు ప్రారంభించేలా అరకు ఎమ్మెల్యే పాల్గుణ చర్యలు తీసుకోవాలి.

– జి.మదనమోహన్, సుజనకోట, ముంచంగిపుట్టు మండలం

మారనున్న రూపురేఖలు

- **జోలాపుట్టు** నుంచి దారెల వరకు ఉన్న **మత్స్యగెడ్డలో** బోటు షికారు, సుజనకోట పం**చాయతీలో** ఎకో టూరిజం కాటేజీలు, పార్కు **నిర్మాణం** చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే చెట్టి **పాల్గుణ** పర్యాటకశాఖకు ప్రతిపాదనలు పంపి**చారు. ము**ఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.
- **సుజనకో**ట పంచాయతీలో మౌలిక వసతుల **కల్పనతోపా**టు మత్స్యగెడ్డకు పర్యాటక హం**గులు సమ**కూరనున్నాయి. గిరిజన యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

గంగాలమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు

- సుజనకోట గ్రామంలోని గంగామ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆంధ్రా–ఒడిశా ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఉన్నారు. ఇందుకు సంబంధించి కూడా కార్యాచరణ రూపొందించారు.



అభివృద్ధి చెందనున్న గిరిజన గ్రామం



మత్స్యగెడ్డలో ఒడ్డున సినిమా చిత్రీకరణ యూనిట్

ఓటర్ల సవరణ సర్వే పూర్తి

- వందేళ్లు దాటిన 61 మంది ఓటర్లపై సమగ్ర విచారణ
- జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల సవరణ సర్వే పూర్తయ్యిందని జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఇంటింటికి వెళ్లి ఆయా ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. ఒకే ఇంట్లో 10మంది ఓటర్లుగా నమోదైన 3431 మందిని గుర్తించామని తెలిపారు. ఫారం–8 ప్రకారం వాటిని నమోదు చేస్తామన్నారు. వందేళ్లు పైబడిన ఓటర్లు 61 మంది ఉన్నారని, వీటిపై మరోసారి సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల తొలగింపు, ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. మృతిచెందిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లకు సంబంధించి ఫారం 13 జారీ చేసి, పక్కాగా పంచనామా నిర్వహించి వాటిని తొలగిస్తామన్నారు. కళాశాలల్లో కొత్త ఓటరు నమోదు చేయడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామన్నారు. యువ ఓటర్లను నమోదు చేయడం ద్వారా ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయానికి 18ఏళ్లు నిండుతున్న యువతీ, యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించామని తెలిపారు. ఓటరు నమోదు, తొలగింపు ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాకు సంబంధిం 3100 వీవీ ప్యాడ్స్, 3700 బ్యాలెట్ యూనిట్లు, 2840 కంట్రోల్ యూనిట్లు వచ్చాయన్నారు. రాజకీయ నేతల సమక్షంలోనే వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచామన్నారు. వీటికి 24 గంటల పాటు పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో పలువురు రెవెన్యూ అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, టీడీపీకి చెందిన వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, వార్డు సభ్యుడు జ్యోతికిరణ్, బీజేపీ నేత డాక్టర్ రాఘవేంద్రరావు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహిస్తున్న డీఆర్వో అంబేద్కర్

ఉపాధ్యాయుల తీరుపై ఐటీడీఏ పీవో ఆగ్రహం

చార్జ్ మెమోలకు ఆదేశం

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లి, బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలతో పాటు ఏడుదురాళ్లపల్లి జీపీఎస్ పాఠశాలను బుధవారం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో తరగతి గదుల్లో ఉపాధ్యాయులు లేకపోవడాన్ని గమనించిన ఆయన ఆరా తీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా బయటకు వెళ్లారని తెలుసుకున్న ఆయన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల వేళల్లో విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు చార్జ్‌మెమోలు జారీ చేయాలని ఆయన ఏటీడబ్ల్యూవోను ఆదేశించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం పీవో చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి, ఎటపాక మండలం లక్ష్మీపురం పీహెచ్‌సీలను కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందుల స్టాక్ వివరాలు, ఓపీ రిజిస్టర్లతో పాటు ల్యాబ్‌ను పరిశీలించారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యసేవలు అందించాలని పీవో ఆదేశించారు.



చిక్కీలను పరిశీలిస్తున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

మానవ హక్కులపై అవగాహన అవసరం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వేదికపై నేతలు

అరకులోయ: మానవహక్కులపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచించారు. పర్యాటకశాఖ పున్నమి అతిథి గృహం గోష్టిలో జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం మానవ హక్కులపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో హక్కులకోసం సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులు కోరే వారు బాధ్యతలను కూడా మరచిపోకూడదన్నారు. గిరిజన ప్రాంతాల్లో మానవ హక్కులపై అవగాహన సదస్సులు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మానవ హక్కులు ఉల్లంఘనకు గురికావడం వల్ల హింసాకాండ నెలకొందని, అనేక మంది గిరిజనుల మరణాలు చోటుచేసుకున్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకూడదని ప్రతి ఒక్కరు కోరుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో తోటి గిరిజనుల సేవే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దొన్ను, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ చైర్మన్ ఎం.వి.ఆర్.డానియల్ మోడి, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి దిలీప్ కుమార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఎంపీటీసీ దురియా ఆనంద్‌కుమార్, ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



ఏఎస్పీ జగదీష్ అడహళ్లి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సూరిబాబు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ గోరా సూరిబాబు (బద్రి) ఉత్తమ సేవలకు గాను బుధవారం ఏఎస్పీ జగదీష్ అడహళి చేతుల మీదుగా రంపచోడవరంలో ప్రశంసా పత్రం అందుకున్నారు. గతంలో మారేడుమిల్లి, రంపచోడవరం, జడ్డంగి, రాజవొమ్మంగి స్టేషన్లలో ఆయన పనిచేశారు. ప్రస్తుతం అడ్డతీగల మండలం దుశ్చర్తి స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల కూనవరం తదితర ప్రాంతాల్లో సంభవించిన వరదల్లో సూరిబాబు విశేష సేవలు అందజేశారని పోలీసు అధికారులు వెల్లడించారు.

ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం



చోద్యం-కంతారం బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కొమ్మిక ఆర్‌బీకే భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- చోద్యం–కంతారం బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- కొమ్మికలో సచివాలయ, ఆర్‌బీకే భవనాల ప్రారంభం

కొయ్యూరు: ప్రతి గ్రామానికి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. రహదారి సౌకర్యంతోనే రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. చోద్యం వంతెన నుంచి కంతారం ఆరోగ్య కేంద్రం వరకు రూ. రెండు కోట్లతో 7.5 కిలో మీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామాల్లో చాలా వరకు సమస్య పరిష్కరించామని చెప్పారు. సంక్రాంతి నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. ఎప్పుడో వేసిన రహదారులకు మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం ఉండదని తెలిసి కొత్త రోడ్లకు ప్రతిపాదిస్తున్నామన్నారు. చీడిపాలెం, పాడి–రత్నంపేట మధ్యలో వంతెనల నిర్మాణానికి ప్రతిపాదించామని చెప్పారు.

సచివాలయ,ఆర్‌బీకే భవనాల ప్రారంభం

కొమ్మికలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జెడ్పీటీసీ వారా నూకరాజులతో కలిసి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సచివాలయ, ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ వల్ల అన్నిరకాల సేవలు గ్రామస్థాయిలో అందుతున్నాయన్నారు. గతంలో ఏ పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. కంతారం,కొమ్మిక సర్పంచ్‌లు కన్నయమ్మ, సెగే సూరిబాబు, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మండల కన్వీనర్ సుధాకర్, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, ట్రికార్ డైరెక్టర్ ఎస్ లోవరాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ విషయంలో పునరాలోచించాలి

అభిప్రాయ సేకరణలో దళిత రైతుల వినతి

ఎటపాక: పోలవరం భూసేకరణ చట్ట ప్రకారం ప్యాకేజీ ఇచ్చేలా ప్రభుత్వం పునరాలోచించాలని దళిత రైతులు కోరారు. పోలవరం ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ సరళవందనం ఆధ్వర్యంలో బుధవారం బాసవాగులో ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్వాసితులకు కాలనీ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అయితే ఆ భూములను దళిత రైతులు సాగుచేసుకుంటున్నందున చట్ట ప్రకారం ఇంటికి, 18 సంవత్సరాల వయసు నిండిన వారికి రూ.5.50 లక్షలు పరిహారంగా నిర్ణయించిందన్నారు.

ఈ విషయంలో పునరాలోలించి ప్యాకేజీ నిర్ణయించాలని బాసవాగు, రామగోపాలపురం గ్రామస్తులు పేర్కొన్నారు. పోలవరం భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని, ఈ ప్రాంతంలో పరిశ్రమ నిర్మించి ఇక్కడ భూములు కోల్పోతున్న వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. తమ నుంచి సేకరించనున్న భూములకు చెల్లించే పరిహారం గిట్టుబాటుగా లేదన్నారు. డిమాండ్లు, సమస్యలపై తీర్మానం చేసి సంతకాలతో ఇవ్వాలని పోలవరం ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ కోరారు. అందుకు రైతులు అంగీకరించకుండా సభ మధ్యలోంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసరావు, సుబ్బారావు, జోసెఫ్, వెంకటరమణ, తహసీల్దార్లు పృథ్వీ, శ్రీధర్, ఉప సర్పంచ్ పార్వతి పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేక కలెక్టర్ సరళవందనం

సీలేరులో ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన



జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ల బృందం

సీలేరు : గిరిజన గ్రామాలలోని సమస్యలపై అధ్యయనం చేస్తున్న ట్రైనీ కలెక్టర్ల బృందం బుధవారం దుప్పులవాడ పంచాయతీ కేంద్రంలో వివిధ అంశాలపై గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సమావేశంలో వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం సీలేరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. మాచ్ ఖండ్ నుంచి మోతుగూడెం వరకు గల విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి వివరాలను ఇంజనీర్ల నుంచి తెలుసుకున్నారు. విద్యుత్ కాంప్లెక్సు నమూనాను పరిశీలించారు. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ జల విద్యుత్ కేంద్రం దేశానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు.

ప్రకృతి దేవతలకు ప్రణామం

ఏజెన్సీ వ్యాప్తంగా గ్రామాల్లో జోల్డా పండగ సందడి నెలకొంది. ఖరీఫ్‌లో వరి నాట్లు పూర్తయిన తరువాత ప్రకృతి దేవతలు, పంచ భూతాలను పూజించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగానే బుధవారం పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని గుడివాడ, లోచలిపుట్టు, కుజ్జెలి, తుంపాడ, రామలపుట్టు, గెడ్డంపుట్టు గ్రామాల్లో గిరి రైతులు పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఔషధ జాతి చెట్ల కొమ్మలతో ప్రకృతి దేవతలకు పూజలు చేసి వరి పొలాల్లో నాటారు. దీనివల్ల చీడపీడల నివారణతోపాటు కొమ్మలపై పక్షులు వాలి క్రిమికీటకాలను నాశనం చేస్తాయని గిరి రైతుల నమ్మకం.



9లో

క్లుప్తంగా

రిమాండ్ ఖైదీ పరారీపై కేసు నమోదు

నర్సీపట్నం: రిమాండ్ ఖైదీ పరారీపై నర్సీపట్నం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ ఎస్.గణేష్ అందించిన వివరాలు...ఇద్దరు వ్యక్తులను కిడ్నాప్ చేసి, బెదిరించి దోపిడీ పాల్పడిన కేసులో చింతపల్లి మండలం మేడూరు గ్రామానికి చెందిన కిల్లో గణేష్ తో పాటు మరో ఇద్దరిని చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో గణేష్‌కు రిమాండ్ విధించడంతో ఈ నెల 29న చింతపల్లి పోలీసులు విశాఖ సెంట్రల్ జైలుకు తరలిస్తూ, భోజనం చేసేందుకు నర్సీపట్నంలోని ఓ హోటల్‌కు వెళ్లారు. పోలీసుల కళ్లు కప్పి నిందితుడు కిల్లో గణేష్ పరారయ్యాడని సీఐ తెలిపారు. చింతపల్లి పోలీసుల ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యాబిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు




సజంతి సంగ్యా, హేనేశ్వరి

మారేడుమిల్లి: తన భార్య, కుమారు కనిపించడం లేదని ఓ భర్త మారేడుమిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాలివి. వలల పుల్లారెడ్డి అనే గిరిజనుడు తన భార్య సజంతి సంగ్యా, తన మూడు నెలల కుమారు హోనేశ్వరులతో కలిసి స్థానిక కానివాడ వీధిలో నివాసం ఉంటున్నాడు. అతడు విజయవాడలోని ఓ ఉయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తూ నెలకు ఒకసారి ఇంటికి భార్య, కుమారుని చూడడానికి వస్తుండేవాడు. ఈ నెల 18వ తేదీన పుల్లారెడ్డికి అతని వదిన ఫోన్ చేసి మీ భార్య పిల్ల కనిపించడం లేదని తెలిపారు, అతను వారి కోసం గాలించాడు. బంధువుల ఇంటి వద్దకు వెళ్లి వెతికినా భార్యాబిడ్డల ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కేటింగ్‌లో మోక్షజ్ఞ సత్తా



ఆస్ట్రేలియాలో పసిడి పతకాలతో మోక్షజ్ఞ

బీచ్‌రోడ్డు: ఆస్ట్రేలియా దేశంలోని బ్రిస్బేన్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషియానియా చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన నరిసెట్టి మోక్షజ్ఞ నారాయణ నాలుగు పసిడి పతకాలు సాధించి ప్రపంచ స్కేటింగ్‌లో సత్తా చాటాడు. 9 ఏళ్ల వయస్సు గల మోక్షజ్ఞ ఫ్రీస్టైల్, సోలో డ్యాన్స్, ఫిగర్ స్కేటింగ్, ఇన్‌లైన్ స్కేటింగ్ విభాగాల్లో పసిడి పతకాలు సాధించాడు. శివాజీ పార్క్‌లోని చిట్టిబాబు, సత్యనారాయణ సారథ్యంలో శిక్షణ తీసుకుంటున్న మోక్షజ్ఞ ఇప్పటి వరకు నాలుగు అంతర్జాతీయ, ఆరు జాతీయ, పది రాష్ట్ర స్థాయి పసిడి పతకాలతో పాటు మొత్తంగా 48 పతకాలను సాధించాడు. ఈ సందర్భంగా మోక్షజ్ఞను పలువురు అభినందించారు.

ఊళ్లకు సరికొత్త అందాలు!



కాశీపురంలో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం



దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లి గ్రామ సచివాలయం

- ఆర్బీకేలు, జీఎస్‌బీలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవనాలు
- ఉమ్మడి విశాఖలో వేగం పుంజుకుంటున్న నిర్మాణాలు
- సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తికి సన్నాహాలు
- వీటికి మంజూరైన నిధులు రూ.508.50 కోట్లు
- ఇప్పటివరకు వెచ్చించిన సొమ్ము రూ.251.79 కోట్లు

సాక్షి, విశాఖపట్నం: ఊళ్లు సరికొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. కొంగొత్త ప్రభుత్వ భవనాలతో శోభిల్లుతున్నాయి. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు), గ్రామ సచివాలయ భవనాలు (జీఎస్‌బీలు), వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మితమవుతున్నాయి. వీటిలో ఇప్పటికే కొన్ని నిర్మాణం పూర్తి చేసుకోగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇలా పునాదుల దశ దాటిన భవనాలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి సంబంధిత శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 728 సచివాలయాలు, 701 రైతు భరోసా కేంద్రాలు, 543 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని తలపెట్టారు. వీటిలో గ్రామ సచివాలయ భవనాలకు రూ.260.57 కోట్లు, ఆర్బీకేలకు రూ.152.91 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.95.02 కోట్లు వెరసి రూ.508.50 మంజూరు చేశారు. ఇప్పటివరకు గ్రామ సచివాలయ భవనాలు 402, ఆర్బీకేలు 241, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు 126 పూర్తయ్యాయి. వీటిలో 326 జీఎస్‌బీలు, 456 ఆర్బీకేలు, 414 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు పునాదులలో ఉన్నాయి. ఇందులో జీఎస్‌బీలకు రూ.143.41 కోట్లు, ఆర్బీకేలకు రూ.66.85 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలకు రూ.41.53 కోట్లు వెచ్చించారు. కాగా పునాదుల్లో ఉన్న వివిధ భవనాల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి వీటి పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. పునాదుల స్థాయి దాటిన ఈ భవనాలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా శరవేగంగా పూర్తికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని విశాఖ జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ డీఎస్ రవీంద్ర 'సాక్షి'కి చెప్పారు.

మారుతున్న గ్రామాల స్వరూపాలు

ఒకప్పుడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలో, సామాజిక భవనాలో కనిపించేవి. చాలా పంచాయతీ కార్యాలయాల్లో వచ్చిపోయే పది మంది కూర్చోవడానికి బెంచీలే తప్ప కుర్చీలు కూడా ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల రూపురేఖలను సమూలంగా మార్చివేస్తూ సరికొత్త పల్లెలకు నాంది పలుకుతున్నారు. ఊళ్లలో కొత్తగా నిర్మిస్తున్న ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలతో ఊళ్లు కొత్త కళను సంతరించుకుని ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

ఆయా భవనాల్లో కుర్చీలు, ఫర్నిచర్‌తో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మరే ప్రభుత్వం సంకల్పించని విధంగా ఈ ప్రభుత్వం హయాంలో నిర్మితమవుతున్న ఈ భవనాలు అన్ని హంగులతో కళకళలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పకడ్బందీగా భూ రికార్డుల శుద్ధీకరణ




మాట్లాడుతున్న డీఆర్వో అంబేద్కర్ హాజరైన తహసీల్దార్లు, సర్వేయర్లు

డీఆర్వో అంబేద్కర్ ఆదేశాలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో భూముల రీసర్వేను సక్రమంగా నిర్వహించి, వాటికి సంబంధించిన రికార్డులను పకడ్బందీగా శుద్ధీకరణ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో పాడేరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల,గ్రామసర్వేయర్లకు భూముల రీసర్వే, మ్యుటేషన్, పీఎం కిసాన్ మంజూరుకు అవసరమైన సమాచారంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 951 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేశారని, ఇంకా 1726 గ్రామాల్లో రీసర్వే జరగాల్సి ఉందన్నారు. రైతుల భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో, ఆర్ఓఎఫ్ఆర్ భూములను గిరిభూమిలో నమోదు చేసి,ఆయా రైతులకు పీఎం కిసాన్ యోజన అమలుచేయాలన్నారు. మ్యుటేషన్ సమయంలో ఆయా భూములను రైతులు సాగు చేస్తున్నారా,టైటిల్ డీడ్ ఉందా లేదా అన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. భూముల రీసర్వేకు ముందు గ్రామసభలు నిర్వహించి, గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ,ప్రైవేట్ భూముల సర్వేకు సంబంధించి అవగాహన కల్పించారు. ఆధార్ సీడింగ్ సక్రమంగా చేయాలని ఆదేశించారు.

నేడు ఇస్కాన్‌లో నృసింహ యజ్ఞం

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో లోక కల్యాణార్థం గురువారం వరాహ నృసింహ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ తెలిపారు. ఈ సందర్భంగా నృసింహ స్వామి నామాలను సామూహికంగా భక్తులు పఠించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 8 నుంచి 11.30 గంటలకు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

పాము కాటుతో యువతి మృతి



కనకలమ్మ మృతదేహం

పెదబయలు: మండలంలోని మారుమూల ఇంజరి పంచాయ తీ సుజ్జరి గ్రామా నికి చెందిన ఐంతెంగి కనకలమ్మ (23)పాము కాటుతో మృతి చెందింది. ఇంట్లో మంచంపై నిద్రించి ఉండగా బుధవారం తెల్లవారుజామున పాము కాటేసిందని ఆమె తల్లిదండ్రులు తల్లిదండ్రులు బాలయ్య, చంద్రమ్మ తెలిపారు. కుమార్తె మృతితో వారి రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

పాలిసెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థుల ధ్రువీకరణపత్రాలను తనిఖీ చేస్తున్న అధ్యాపకుడు

మురళీనగర్: పాలిసెట్ రెండవ విడత కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా చేరారు. ఇంకా మిగిలిన సీట్ల భర్తీకి ప్రభుత్వం రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మిగిలిపోయిన సీట్ల భర్తీకి సంబంధించి రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన విద్యార్థులు వచ్చే ఒకటో తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవచ్చు. ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకోని వారు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవచ్చు. సెప్టెంబరు ఒకటి, రెండో తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉంది. నాలుగో తేదీన సీట్లు కేటాయిస్తారు. నాలుగు నుంచి 7వ తేదీ వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌తోపాటు కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

నేటితో ముగియనున్న ఇంజినీరింగ్ ప్రవేశాలు

ఏపీఈఏపీసెట్‌లో సీట్లు పొందిన విద్యార్థులు వారికి కేటాయించిన ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరడానికి గురువారంతో గడువు ముగుస్తుంది. ఈనెల 26 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. వీరు కేవలం అలాట్‌మెంట్ లెటర్, సెల్ఫ్ జాయినింగ్ లెటర్ ఉన్నా సరిపోతుంది. ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా ఈసెట్ కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో వీరికి గురువారం సీట్లు కేటాయిస్తారు. వీరు సెప్టెంబరు ఒకటి నుంచి నాలుగో తేదీలోగా వారికి కేటాయించిన ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. వీరికి చివరి కౌన్సెలింగ్ ఆని అధికారులు చెప్పారు.

ఏపీఎఫ్‌పీఎస్‌లో డీఆర్పీ పోస్టులకు దరఖాస్తులు

తుమ్మపాల: రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ(ఏపీఎఫ్‌పీఎస్)లో జిల్లా రిసోర్స్ పర్సన్(డీఆర్పీ)గా పనిచేసేందుకు ఆసక్తి గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.ప్రభాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, డిగ్రీలతో పాటు ఇతర డిగ్రీలు పూర్తి చేసి, బ్యాంకింగ్‌పై అవగాహన కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులకు అవగాహన కల్పించడం, బ్యాంకు లింకేజీ చేయించడం, ఆహార పరిశ్రమల స్థాపనకు వీరు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో వచ్చే నెల 4వ, మధ్యాహ్నం 2 గంటలకు ఉద్యాన కార్యాలయం, గుండాల వీధి, తుమ్మపాల గ్రామం నందు స్వయంగా హాజరుకావాల్సిందిగా కోరారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

పాయకరావుపేట: ఇందిరా కాలనీ సమీపాన గల రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తుని నుంచి నర్సీపట్నం వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు నుంచి పడి మరణించినట్లు ఆయన తెలిపారు. మృతుడు వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, పసుపు రంగు షర్టు, చారల లుంగీ ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు

ఆరిలోవ: ఎస్ఐ మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ నియామకాల కోసం విశాఖపట్నం నగర్ ప్రాంతం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు జరగనున్న పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకే అభ్యర్థులు హాల్ టిక్కెట్లు, సర్టిఫికెట్లతో మైదానం వద్దకు హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో, విజయనగరం ఎస్పీ దీపికాపాటిల్ సమక్షంలో పోలీస్ అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం ఎత్తు, బరువు తదితర పరీక్షలు జరిపారు. అందులో ఎంపికైన వారికి 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనబరిచిన వారికి లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో మహిళా అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఐజీ హరికృష్ణ మాట్లాడుతూ 2,745 మంది మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు 685 మందికి హాల్ టిక్కెట్లు పంపగా వారిలో 512 మంది హాజరయ్యారన్నారు. అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గోమాత ప్రాణాలు కాపాడిన గ్రామస్తులు

- 15 అడుగుల లోతులోని నీరులేని బావిలో పడిన ఆవు
- సురక్షితంగా బయటకు తీసిన యువకులు



బావిలో పడిన ఆవును బయటకు తీస్తున్న యువకులు

పెదబయలు: రెండు రోజుల క్రితం బావిలో పడిన ఆవును గ్రామస్తులు బుధవారం సురక్షితంగా బయటకు తీసి మూగజీవి ప్రాణాలు కాపాడిన ఘటన మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి కాలనీలో జరిగింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గోమంగి పంచాయతీ సరియాపల్లి కాలనీ సమీపంలో పాడుబడిన నీరు లేని బావిలో ఈ నెల 28 తేదీన ఆవు జారి పడింది. అయితే రెండు రోజుల నుంచి ఆవు యజమాని ప్రసాద్ గ్రామంలో వెతికినా కనిపించలేదు. ఆటుగా వెళ్తున్న వారు బావిలో ఆవు పడి ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో సుమారు రెండు గంటల పాటు గ్రామ యువకులు శ్రమించి బావిలో దిగి ఆవును తాళ్లతో కట్టి బయటకు తీశారు. బావిలో ఆవు పడడం వల్ల స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. గోమాతను సురక్షితంగా బయటకు తీసుకున్న వారిలో రాధాకృష్ణ, ప్రతాప్ చంద్, ప్రసాద్, సినిండ్ర, కొండబాబు, వెంకటరమణ, ప్రభాకర్, యువరాజు తదితరులున్నారు.

లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు చర్యలు

- ఎంపీ జీవీఎల్‌ను కోరిన అసోసియేషన్ల సభ్యులు



అసోసియేషన్ల సభ్యులతో జీవీఎల్ నరసింహారావు

బీచ్‌రోడ్డు: లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించేందుకు పోర్టును మరింత అభివృద్ధి చేయాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎంపీ జీవీఎల్ నరసింహారావును స్టీమ్‌షిప్ ఏజెంట్స్ అసోసియేషన్, కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్, స్టీవెడోర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. సిరిపురంలోని దత్త ఐలాండ్‌లోగల వీసీసీఐ కార్యాలయంలో పలు అసోసియేషన్ల సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను జీవీఎల్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బల్క్ స్టోరేజ్ ఫెసిలిటీ కోసం కవర్డ్ స్టోరేజ్ వీపీఏ చేపట్టాలన్నారు. నేషనల్ లాజిస్టిక్స్ పాలసీకి అనుగుణంగా 24/7 పోర్ట్ కనెక్టివిటీ ఉండాలన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా పలు రోడ్డు మార్గాలను పూర్తి చేయాలని కోరారు. అసోసియేషన్ల సమస్యలను విన్న జీవీఎల్ వాటిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మేరా మాటీ, మేరా దేశ్‌లో భాగస్వాములుకండి

ఎంపీవీ కాలనీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేరా మాటీ, మేరా దేశ్ కార్యక్రమంలో దేశంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా నిలిపే కార్యక్రమంలో ప్రజలంతా భాగం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు ఐక్యతాభావం పెంచే విధంగా నా మట్టి, నా దేశం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ లక్ష్యానికి ఎంపీహెచ్ఈవోల తూట్లు

- వచ్చిన చోట చేరేందుకు నిరాసక్తత
- అర్బన్ పోస్టింగుల కోసం పైరవీలు
- ఏజెన్సీలో ఖాళీలున్నా ఆసక్తి చూపించని వైనం

మహారాణిపేట: ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తూట్లు పొడుస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులతో పాటు 14 మంది సిబ్బంది రిక్రూట్ కార్యక్రమాన్ని నీరు కారుస్తున్నారు. వివరాలివి.. జీవో-143 ప్రకారం ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో 14 మంది సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఈ నెల 26న మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్ఈవో) బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందుకోసం మొత్తం 6 జిల్లాల నుంచి 74 మందిని ఆహ్వానించారు. వీరికి ఓ వరస సంఖ్య కూడా ఇచ్చారు. ఇందులో కొంత మంది వరస సంఖ్యలో వచ్చిన నంబర్‌ను తిరస్కరించారు. నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్‌కు అంగీకరించిన ఎంపీహెచ్ఈవోలకు బదిలీని తిరస్కరించే అధికారం లేదు. కానీ ఇక్కడ కొంత మంది తమకు వచ్చిన పోస్టింగ్‌ను తిరస్కరించారు. దీంతో వారి తర్వాత ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలా 18 మంది తిరస్కరించిన జాబితాలో ఉన్నారు. ఈ 18 పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. ఏజెన్సీలో పలు పీహెచ్‌సీల్లో ఎంపీహెచ్ఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానీ వీరు అక్కడ ఉద్యోగాలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. నగరంలోని కేజీహెచ్, ఘోషా, విమ్స్ తదితర ఆస్పత్రుల్లో చేరేందుకు పైరవీలు చేస్తున్నారు. ఇటువంటి వారికి వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

'కళ' నెరవేరిన వేళ..

గాయకుడిగా రాణిస్తున్న రాజుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న జామి అప్పలరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ కలలు కంటారు. కొంత మంది మాత్రమే తమ కలలను సార్థకం చేసుకుంటారు. ఆటువంటి కోవకే వస్తారు మండలంలోని నాగులాపల్లికి చెందిన జామి అప్పలరాజు (సింగర్ రాజు). నిరుపేద కుటుంబంలో జన్మించినా కళపై మక్కువతో గాయకుడిగా రాణించడంతో పాటు తోటి కళాకారులను ఆదుకుంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన హైదరాబాద్‌లోని హెచ్ఎన్‌సీ యూనివర్సిటీ జీవిత డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగులాపల్లికి చెందిన జామి నూకరాజు, చినమ్మ(సర్పంచ్)ల దంపతుల కుమారుడు అప్పలరాజు తన గానంతో ప్రముఖ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, కీరవాణి వంటి వారిని కూడా మెప్పించారు. కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు. ఉత్తరాంధ్ర సింగర్స్ అసోసియేషన్ స్థాపించడంతో పాటు 426 మంది కళాకారులకు రూ.10 లక్షల బీమాను ఉచితంగా రెన్యూ చేయించారు. కరోనా కష్టకాలంలో 4,500 మందికి నిత్యావసర సరుకులు అందించారు. కరోనాతో చనిపోయిన వ్యక్తుల అంత్యక్రియల్లో రాజు సాయమందించారు. అనకాపల్లి కేంద్రంగా జేబీఆర్ రికార్డింగ్ స్టూడియో, జేబీఆర్ మ్యూజిక్ అకాడమీ స్థాపించి నూతన గాయనీగాయకులకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. 2019 నుంచి విశాఖజిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా పనిచేసిన రాజు ఇటీవల వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాజుకు డాక్టరేట్ రావడం పట్ల నాగులాపల్లి గ్రామస్తులతో పాటు అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

నూకాంబిక ఆలయ చైర్మన్‌గా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ



అమ్మవారి సన్నిధిలో బాధ్యతలు స్వీకరిస్తున్న కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్‌గా కొణతాల మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనతోపాటు పాలకమండలి సభ్యులు కంబంపల్లి కోటీశ్వరం, పీలా లక్ష్మి, పాము అనూరాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమామహేశ్వరమూర్తి, బుద్ద నరసింగరావు, గొల్లపల్లి నరసింగరావు, కొందూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్ వై.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ నూతన కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అమ్మవారి సన్నిధిలో సంతకం చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ నూతన కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి అత్తి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సకల గోవింద, కొణతాల సంతోష్, ఆప్పారావు నాయుడు, కొణతాల శ్రీనివాస్, బొడ్డా కాళీ, బొండా శంకరరావు, వేగి త్రినాథ్, కొణతాల కృష్ణంరాజు, ఆడారి చక్రవర్తి పాల్గొన్నారు.

10న నాగవంశీయుల సమావేశం

తగరపువలస: ఉత్తరాంధ్రలో ప్రధాన వేదికపై సెప్టెంబర్ 10న నాగవంశీయుల రాష్ట్ర సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక మహారాజాపేట కూడలిలో ఉత్తరాంధ్ర నాగవంశీయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం నాగవంశీయుల రాష్ట్ర కార్పొరేషన్, డైరెక్టర్లు, ఇతర పదవులు కల్పించడంపై చర్చించారు. అలాగే బీసీ డీ నుంచి బీసీ ఎ లోకి మార్చడంపై మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా సెప్టెంబరు 10న రాష్ట్ర స్థాయి సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడినట్లు తెలిపింది. వివిధ పార్టీలకు చెందిన నాగవంశీయులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

దేవరాపల్లి: మండలంలోని ఎల్.బి.పటం శివాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. హుండీ పగలగొట్టి సుమారు వెయ్యి రూపాయలు అపహరించినట్లు చెప్పారు. సీసీ కెమెరాకు చెందిన మానిటర్ కూడా చోరీకి గురైనట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.